తగాదా తీర్చిన ఉగాది

శ్రీమతి ద్వాభాష్యం కామేశ్వరి

ఉగాది పండుగవచ్చిందంటే ప్రతియింట నవచైతన్యము, కళాకాంతులు సౌభాగ్యచిహ్నంగా రాణిస్తున్నవి. ఉదయం తలగడుగులు కాగానే పిన్నలు, పెద్దలు వేపపువ్వుపచ్చడి కొరకు ఎదురు చూస్తున్నారు. సూర్యభగవానుడు తన సహజ కాంతులతో తూర్పుదిశనుండి బయలుదేరాడు. క్రమంగా సూర్యరశ్మి నలుదెసల ద్విగుణీకృతంగా వ్యాపిస్తున్నది. ఒకగుమ్మంలో మాత్రం ఒకయువతి ఎవరికొరకో ఎదురు చూస్తూ నిలబడియున్నది. ఆమె ముఖంలో ఆశ, నిరాశలండు సమ్మిళితమైయున్నవి. అంతేకాదు భయాందోళనలు సయితము పొడసూపుచున్నవి. తలారస్నానముచేసి యుండటంచేత చిందర బందరగానున్న వెంట్రుకలు గాలికి ఎగురుతున్నవి. ఇంతలో పదేళకుర్రవాడువచ్చి "అక్కయ్యా! బావ యింకారాలేదే! బండివచ్చే వేళ కూడమించిపోయింది" అన్నాడు.

"తప్పకుండా వస్తానని వ్రాశాడు. బండిరావడం ఆలస్యమయియుంటుంది, లేదా తప్పైనాపోయి యుంటుంది." అన్నది పద్మ.

గుమ్మంలోనుండి వెళ్లిపోయి గదిలో కిటికీ ప్రక్కనున్న వాలు కుర్చీలోకూలబడింది. ఆమె బురలోని యూహలు వాయువేగమునో వేగంగా దొర్లుతున్నవి.

"తప్పకుండా వస్తానని, వచ్చి పిలుచుకొని వెళతానని వ్రాశాడుకదా! ఎందుకురాలేదబ్బా! ఖర్మం చాలక మామగారికి తెలిసి మరల అడ్డుపడ్డాడేమో! అయినా అయియుండవచ్చు"

గతమంతా స్ఫురణకువచ్చేసరికి పద్మకంపించిపోయింది. క్రిందటి ఉగాదినాడే తనభర్తకు, తనకూ ఎడబాటు ఏర్పడింది. ప్రభాకరంపండుగకు అత్తగారింటికివచ్చాడు. కొత్తఅల్లుడికి జరుగవలసిన మర్యాదలతో మామగారు వెంకట్రామయ్య అప్పోసప్పోచేసి ఒక రెడీమేడ్ సూటు, పద్మకు ఒకచిల్కుచీర కొనిపెట్టి "ఈ సారికి యిలాగ వెళ్లిపోనీ నాయనా! ఇంతకంటె మీకివ్వడానికి ఏమి అవకాశం లేకపోయింది. రానున్న పండుగకయినా రేడియో, సైకిలు ..." అని ప్రాధేయపూర్వకంగా అన్నాడు. పద్మకు పరిస్థితులు తెలుసు కాబట్టి తలవంచుకుంది. ప్రభాకరం సయితం "దానికేంలేండిమామగారూ! అవకాశమున్నపుడే యిద్దురుగాని; ఆ విషయంగా మీరేమీయిబ్బందిపడవద్దు" అన్నాడు. అల్లునిమంచితనానికి వెంకట్రామయ్యగారు సంతోషపడ్డాడు.

వెంకట్రామయ్య స్కూలు మాష్టరు. ఆస్తి పాస్తి యున్నవాడుకాడు. ఊళ్లోగల పరపతి, తనమంచితనంవలన గౌరవంగా జీవయాత్ర సాగిస్తుండేవాడు. ఆయనకు ఒకకొడుకు, పద్మ ఒక్కతేకుమార్తె. పద్మ మీద తండ్రికేకాదు యింటిల్లిపాదికి అభిమానం మెండు. పద్మ అందచందాలలోను, తెలివితేటలలోను యింటబయటకూడ అభిమానపాత్రురాలుగానుండేది. అష్టకష్టాలైనా పడి ఆమెకు స్కూలు ఫైనలు దాక చదివించాలను దీక్షపూనాడు వెంకట్రామయ్య. ఏనాటికైనా ఆడపిల్లను ఒక అయ్యచేతిలో పెట్టవలసిందేకదాయని స్కూలు ఫైనలుకాగానే పద్మకు వివాహసంబంధాలు వెతకడం మొదలు పెట్టారు ఆప్పట్లో అదృష్టంకొద్దీ ప్రభాకరం ఆమెకు జీవిత భాగస్వామిగా నిర్ణయమయ్యాడు.

ప్రభాకరం సంపన్నుల యింటిబిడ్డ. బి, ఏ. ప్యాసయినాడు. సన్నంగా, పొడుగ్గా నాజూకుగా నుండేవాడు. అతడు అభ్యుదయవాదిగా కట్నకానుకలకు వ్యతిరేకికాని, తండ్రి పరంధామయ్యకు మాత్రం కుమారుడు పుట్టినప్పటినుండి బి. ఏ. ప్యాసయ్యేదాక అతనికి ఎంత ఖర్చుపెట్టాడో వడ్డీతోసహా వరకట్న రూపంలో రాబట్టాలనే మనస్తత్వంగలవాడు. పరంధామయ్య పెద్దకుమార్తె వచ్చి తండ్రిని "నాన్నా! ప్రభాకరంకు మా అమ్మాయిని యిచ్చిచెస్తాం. మా

ఆస్తిపాస్తుల విషయం నీకు తెలుసు కాబట్టి మా శక్తి ననుసరించి కట్నంకూడ యిస్తాం" అని అడిగితే పరంధామయ్య "ఆదేమిటమ్మాయ్ అలాగంటావు! ప్రభాకరంకు యీ నాటివరకు చదువు వగైరాలకు 16 వేల రూపాయిలు ఖర్చయినవి. కనీసం యిరవై వేలైనా కట్నం రాదాయని ఎదురుచూస్తున్నాను. సంబంధాలకేం అనేకం వస్తున్నవి కాని... యిప్పుడే ఏం తొందరలేయని యూరుకున్నాం. ఈ పరిస్థితులలో నన్నేం చేయమంటావో చెప్పనీవే!" అన్నాడు. కూతురు, అల్లుడు కిక్కురుమనకుండా వెళ్లిపోయి తమకు తగ్గచోటయిచ్చి కూతురుకి పెళ్లి చేశారు. కట్నకానుకలు రాబట్టే విషయంలో ప్రభాకరంకు నచ్చచెప్పాలని పరంధామయ్య నయాన, భయాన ఎంతగానో చెప్పాడు. కాని ప్రభాకరం సమ్మతించక కట్నకానుకలతో ప్రమేయం లేకుండానే కోరి పద్మను వివాహమాడ నిశ్చయించుకున్నాడు. ఒక్కడే కావడంవల్ల కుమారుని పై మమకారంకొద్దీ ఆ వివాహానికి సమ్మతించక తప్పిందికాదు. ఉన్నంతలో ప్రభాకరంకు పద్మనిచ్చి వైభవంగా వెంకట్రామయ్య వివాహం చేశాడు. అల్లుడు కోరకపోయినా అలకపాన్పు మీద రిస్టువాచ్, ఉంగరం యిచ్చాడు. ఈడు జోడుగానున్న దంపతులను బంధుమిత్రులు అభినందించి ఆశీర్వదించారు.

పరంధామయ్య మాత్రం తనమాట చలామణి కాలేదనే అక్కసుతో పెండ్లి సందర్భమున బావగారూ! కట్నకానుకలు లేనేలేవు. పోనీ అల్లుడికి ఒక రేడియో, సైకిలైనా కొనిపెడ్తే బాగుంటుంది నలుగురిలో" అన్నాడు పరంధామయ్య.

వెంకట్రామయ్య ఏమి మాట్లాడలేక మౌనంవహించేసరికి అంగీకారసూచకమైంది. అప్పటినుండి కొనాలనుకున్నా వెంకట్రామయ్యకు పరిస్థితులనుకూలించలేదు. ఏం చేస్తాడుపాపం! ఆదాయం నిత్యావసరాలకే చాలీ చాలనట్లుంటుంది. కాలం చూద్దామా అంటే ఏది చూడబోయినా కొనబోతే కొరివిగానున్నది. ముఖ్యంగా మధ్యతరగతివారు అభిమానానికి ప్రాకులాడుతూ పడుతున్నయాతనలు అనేకం. పండుగకు గుడ్డలు కొనడానికే కటకటలాడింది.

అల్లుడు గడియారం, సైకిలుకు పట్టుపట్టకపోయినా ఏనాటికైనా పరంధామయ్యతో పేచీవ్యవహారమేననే భయం మాత్రం వెంకట్రామయ్యను బాధిస్తూనే యుండేది.

పండుగ వేడుకలలో యింటిల్లిపాది కులాసాగా కాలంగడుపుతుంటే మిట్టమధ్యాహ్నమప్పుడు గొడుగు చంకన పెట్టుకొని, చేతిలో ఒక కాకీ సంచితో పరంధామయ్య ప్రత్యక్షమయ్యాడు. ఆయన వాలకం చూడంగానే వెంకట్రామయ్యకు అనుమానం కలిగింది. ఆయనరాంగానే వెంకట్రామయ్య పరామర్శచేసి కాళ్లకు నీళ్లిప్పించి స్నానంచేసి భోజనానికి లెమ్మన్నాడు.

పరంధామయ్య "భోజనానికేంలెండి! ప్రక్కవూళ్లో పనియుండివచ్చి, యిక్కడికిలా చూచిపోదామని వచ్చాను. ఇంతకీ అల్లుడికి యీసారైనా రేడియో, సైకిలు కొనిపెట్టాగా" అన్నాడు కండ్లు పైకి ఎగపీకుతూ.

ప్రభాకరం తలవంచుకునే "నాన్నగారూ! మామగారు ఏదో యిబ్బందుల్లో నున్నట్లున్నది, ఎప్పుడో అవకాశం ఉన్నప్పుడుకొని పెడతారు_ అవి లేనిదానివలన మనకిప్పుడు జరుగనిదేమిటి?" అన్నాడు.

ఆమాటలు విని పరంధామయ్య మండిపడ్తూ "చాలు! చాలు! మూఁషుకు వెంటేసుకొని మాట్లాడుతున్నందుకు సిగ్గైనాయున్నట్లు కనుపించడంలేదు. పెండ్లినాడు కట్నంలేకపోగా, ముద్దుముచ్చట్లుకని రిస్టువాచ్, సైకిలయినా కొని యివ్వడానికి యింతవరకు గతిలేదు. ఇప్పుడు కాకపోతే యింకెప్పుడిస్తాడు? పదివేలు పదిహేను వేలు కట్నమిచ్చి పిల్లనిస్తామనివచ్చిన బంగారంవంటి సంబంధాలు మానుకొని చివరకు యీ దరిద్రపు సంబంధం మనకు దాపరించింది. ఇక ఒక్క నిముషమైనా యిక్కడ నిలవకూడదు _ పదముందు" అని గద్దించి పైపంచ సవరించుకుంటూ ముందుకు నడిచాడు. ప్రభాకరం చిన్నబోయిన ముఖంతో ఆయన ననుసరించక తప్పింది కాదు. వెంకట్రామయ్యకు నడుములు విరిగినట్లయింది. పద్మ కండ్ల నీళ్లు కండ్లగ్రుక్కుకుంది: ఆయన కుమార్తె దాంపత్యజీవితంలో నేమి విషమపరిణామాలు రానున్నవోయని వాపోవసాగాడు. పద్మ మానసికంగా తన భవిష్యత్తునుగురించి కలవరపడుతున్నా తన్ను చూచి అల్లాడుతున్న తల్లి దండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పవలసివచ్చింది.

రెండు నెలల తరువాత ప్రభాకరం దగ్గరనుండి తను యిల్లువదలిపెట్టి పోయి మద్రాసుచేరాడనియు, అక్కడ ఉద్యోగంకొరకు ప్రయత్నము చేస్తున్నాడని జాబువచ్చింది. తర్వాత కొంతకాలానికి మంచి ఉద్యోగం దొరికిందని త్వరలోవచ్చి పద్మను పిలుచుకొని వెళ్తానని ప్రభాకరం జాబువ్రాశాడు, అలా సంవత్సరం గడచింది. వెయ్యికండ్లతో భర్త రాకకు పద్మ ఎదురుచూడసాగింది. వెంకట్రామయ్య ఉగాదికి రమ్మని అల్లునికి జాబువ్రాస్తే తప్పకవస్తానని వ్రాశాడు. దాన్నిచూచే పద్మ, యింటిల్లిపాది గంపెడాశతో అల్లునిరాకకు ఎదురుచూడసాగారు,

ఇలా పరిపరి విధాల ఆలోచిస్తుండగానే వాకిట్లోనుండి "అక్కయ్యా! బావవస్తున్నాడే" అంటూ ఆమె తమ్ముడు గదిలోకిపారివచ్చాడు. చిరునవ్వుతో గడపలు ఎక్కివస్తున్న ప్రభాకరంను ఆనందభాష్పములతో పద్మ స్వాగతమిచ్చింది. వెంకట్రామయ్య, భార్య ఆనందపరవశులై అల్లుని మర్యాదలతో యింట్లోకి తీసికొనివెళ్లారు.

ఆ నాడు రాత్రిబండికే ప్రభాకరం ప్రయాణం కట్టాడు. వెంకట్రామయ్య మధ్యాహ్నం భోజనాలయాక సైకిలు, రేడియో వద్దంటున్నా అల్లునకిస్తూ "నాకు మాత్రం మరెవ్వరు నూరుమందియున్నారు? ముద్దుముచ్చట్లకయినా పద్మ ఒక్కతేకదా ఆడపిల్ల! నేను యివ్వవలసినవాడను–నీవు తీసుకోవలసినవాడవు. నీవు మా యింటి అల్లుడవుకావడం మా అదృష్టం. ఇంతకాలం వసతి చిక్కక యివ్వలేకపోయాను – యీనాడు అమరినవి – తీసికో నాయనా! భార్యభర్తలు మీరిద్దరు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లండి" అని దీవించాడు, ఆరాత్రి బండికి కూతురిని, అల్లుణ్ణి రైలెక్కించి మద్రాసుకు పంపాడు వెంకట్రామయ్య. కుమార్తె ఎడబాటు కష్టమనిపించినా ఆమె సౌభాగ్యం చూచి మతిస్థిమితపరచుకున్నారు.

రెండు సంవత్సరాలకు పద్మకు పండంటికొడుకు పుట్టాడు. పరంధామయ్య మాత్రం ప్రభాకరం తన మాటవినలేదని అతని జోక్యం పట్టించుకోకుండా, చూచి రావడానికి కూడ వెళ్లాడుకాదు. లంకంత యింటో పిల్ల, జల్లలేకుండా దిక్కుదిక్కుమంటూ పర ధామయ్య భార్యతోనుండేవాడు. ఒక్కొక్కప్పుడు మనుమని, కొడుకుకోడల్ని పోయిచూచి వద్దామనిపించినా ఆత్మాభిమానం అడ్డుపడేది పరంధామయ్యకు. మనోవ్యాధితో కొంతకాలానికి ఆయన మంచంపట్టాడు. చాల బలహీనస్థితి ఏర్పడేసరికి గత్యంతరము లేక ఆయన స్నేహితుడు రామనాధం ప్రభాకరంకు టెలిగ్రాం యిచ్చేసరికి ప్రభాకరం, పద్మ బిడ్డనెత్తుకొనివచ్చారు.

"నాన్నా! ఎలాగుంది" అని అడిగాడు ప్రభాకరం మంచందగ్గరకువెళ్లి, పద్మ కుమారుని చేతులలో ఎత్తుకొని ప్రక్కనే నిలబడింది.

పరంధామయ్య వాళ్ళను చూచి వెక్కివెక్కి ఏడ్వసాగాడు. "వచ్చారా నాయనా! యిలాగున్నాను. ఇంతకాలం మిమ్ములను వచ్చి చూడనైనా నోచుకోని కఠినుడను" అన్నాడు ఆయాసంతో,

పద్మ "ఊరుకోండి! మామగారూ! యిడుగో బాబు" అంటూ పిల్లవాణ్ణి పరంధామయ్య మంచంమీదకూర్చొన బెట్టింది.

పరంధామయ్య మెల్లగాలేచి కూర్చొని బాబును ఒళ్లో కూర్చొపెట్టుకున్నాడు.

రామనాధం నవ్వుతూ "పరంధామయ్య జబ్బు ఎగిరిపోయింది. ఇంతకాలమిది మనోవ్యాధి. రెండు రోజులు కోడలి సపర్యలతో గుర్రంలాగ లేచినడువడూ!" అంటు యింటికి వెళ్ళిపోయాడు. పరంధామయ్యకు సంపూర్ణారోగ్యం చేకూరింది. మర్నాక యుగాది ఆరోజే. ఇల్లు కళకళలాడుతూ సందడిగానున్నది. మనుమని ఆడిస్తూ పరంధామయ్య మురిసిపోతున్నాడు. భోజనాలయాక ప్రభాకరం తండ్రితో తనకిక సెలవు లేదని, మరునాడు ప్రయాణమయి వెళ్ళాల్సియున్నదని చెప్పాడు.

"ఈ వయస్సులోనున్న నన్ను మీయమ్మను వదలి వెళ్ళదలచుకున్నారా? నీవు పోయి సంపాదించి సాధించేది మాత్రంఏమిటి? మనకు భగవంతుడు ఏ లోటులేకుండా యిచ్చాడు. అంతగా నీవింకా డబ్బు సంపాదించదలచుకుంటే లాచదివి యిక్కడే ప్రాక్టీసు పెట్టుకొని యింటి పట్టుననుండవచ్చును. ఏమమ్మా పద్మా! నీవు చెప్పమ్మా, మమ్ములను వదలి పోవడం మీకు ధర్మమేమో"నని పసిపాపలాగ వలవలలాడాడు.

"అదేమిటండీ! మామగారు అంతగా చెప్పతుంటే ఎప్పుడో ఏదో అన్నారని వెళ్ళిపోతా

నంటారా ? ఆయనకు మాత్రం మనంతప్ప మరెవ్వరున్నారు ? వృద్ధాప్యంలో ఆయనమనసు కష్టపెట్టడం మనకు మాత్రం ఏమి క్షేమకరం !” అన్నది పద్మ ప్రాధేయపడ్తూ.

ప్రభాకరం ఏది మాట్లాడలేక “మీ యిష్టమది అయితే నేను మాత్రం కాదంటానా” అంటూ లోపలికి వెళ్లాడు. ప్రభాకరం వెళ్లి మద్రాసులో ఉద్యోగానికి రాజీనామయిచ్చి యిల్లుఖాళీచేసి సామానులతో తిరిగివచ్చాడు.

కొడుకు, కోడలు కాపురంచేస్తుంటే పరంధామయ్య దంపతులు మనుమని ఆడించిపాడించి ఆనందిస్తుండేవారు. ఉగాదితో ఆరంభమయిన తగాదా ఉగాదితోనే తీరి సౌభాగ్య సంపద సమకూరిందని పరంధామయ్య, పద్మ కూడ అనుకుంటుండేవారు.

పొగరుబోతు

ఒక పేదవాడు అడివికి వెళ్ళి కట్టెలు కొట్టుకొని వీపుమీద వేసుకుని పట్టణంలో అమ్ముకునేందుకు వెళ్లేడు. కట్టెలు పొడవుగా వున్నందువల్ల ఎవరికైనా తగులుతాయేమోనని వాడు ‘‘అయ్యా, మీబట్టలు జాగ్రత్త! బట్టలు జాగ్రత్త!’’అని అరుచుకుంటూ వెళ్లేడు.

ఆదారెంట వెళుతున్న, పొగరుబోతు వొకడు కట్టెలు కొట్టుకునే యీ దరిద్రుడికి దారిచ్చి ప్రక్కకి తప్పుకోవడమేమిటనుకున్నాడు. అతని కోటుకొక కర్ర తగిలి బాగా చిరిగింది. పొగరుబ్బోతు కోపంతో రెచ్చిపోయాడు. అతడు పేదవాడిని న్యాయమూర్తి వద్దకు యీడ్చుకెళ్ళి తనకు జరిగిన నష్టానికి పరిహారం యివ్వాలని కోరేడు. ఈ నష్టం ఎలాజరిగిందని న్యాయమూర్తి చాల సార్లు అడిగాడు, కాని పేదవాడు ఒక్కమాటైనా ఆడలేదు.

‘‘ఈ మూగవాడిని నాదగ్గరకెందుకు తీసుకు వచ్చావయ్యా? వాడినుండి నేను ఏ విషయమూ తెలుసుకోలేను, ఏం లాభం?’’ అన్నాడు న్యాయమూర్తి పొగరుబోతుతో.

’‘అయ్యా! వాడు కేవలం మూగవాడిలా నటిస్తున్నాడండీ. వాడు వీధిలో కట్టెలు మోసుకెళ్తుతూ’’ అయ్యా మీ బట్టలు జాగ్రత్త’’ అని కేకలేస్తూ నడిచాడు’’ అన్నాడు పొగరుబోతు.

’‘సరే అయితే, వాడలా అరిస్తే నువ్వెందుకు జాగ్రత్తపడలేదు? ’’అని న్యాయమూర్తి కేసు కొట్టివేశాడు.